# కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పండి



బోడుప్పల్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి, ప్రక్కన మేయర్ బుచ్చిరెడ్డి, పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు

- సబ్బండ వర్గాలు బీఆర్ఎస్ వైపే
- బోడుప్పల్ లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి
- అర్రాస్ పాటలో కాంగ్రెస్ టికెట్ల అమ్మకం
- కేసీఆర్ హామీ ఇస్తే వంద శాతం అమలు చేస్తారని ప్రజల విశ్వాసం

బోడుప్పల్, అక్టోబర్ 21 : దశాబ్దాల పాటు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ చేసిన అభివృద్ధి మాత్రం శూన్యమని మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి విమర్శించారు. కలహాలు, కుట్రలు, కుతంత్రాలకు కాంగ్రెస్ పుట్టిల్లుగా నిలిచిందని ఎద్దేవా చేశారు. శనివారం బోడుప్పల్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని స్థానిక పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, మేయర్ సామల బుచ్చిరెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా బోడుప్పల్ ప్రధాన కూడలి అంబేద్కర్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. స్కాంల కాంగ్రెస్‌ను ప్రజలు కాలగర్భంలో కలిసే సమయం ఆసన్నమైందని, ఓటుతోనే ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. కేసీఆర్ హామీఇస్తే కచ్చితంగా వందశాతం అమలు చేస్తారని ప్రజలు విశ్వసిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

### కాంగ్రెస్‌లో టికెట్ల అమ్మకం : మంత్రి

ఐదేండ్లలో చేసిన అభివృద్ధి, వచ్చిన సర్వే రిపోర్టు ఆధారంగా బీఆర్ఎస్‌లో టికెట్లు లభిస్తే... కాంగ్రెస్ పార్టీలో అర్రాస్ పాటలో టికెట్లు అమ్ముకుంటున్నారని మంత్రి మల్లారెడ్డి ఆరోపించారు. తొమ్మిదిన్నరేండ్లలో చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నామని, మరి కాంగ్రెస్ హయాంలో చేసిన స్కాంలను చూపించి ఓట్లు అడుగుతారా ? అని ప్రశ్నించారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, బోడుప్పల్‌ను ప్రగతిపథంలో నడిపిన సర్కారును మరోసారి ఆశీర్వదించాలని కోరారు. బోడుప్పల్‌లో ఉన్న తాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున భవిష్యత్తులో అర్హులైన పేద కుటుంబాలకు రూ.4వందలకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. దశలవారీగా ఆసరా ఫించన్లను రూ.5016కు పెంచుతామని, స్వశక్తి మహిళా గ్రూపులకు భవనాలను నిర్మిస్తామని, అగ్రవర్ణ పేదలకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున గురుకులాలను ఏర్పాటు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చినట్లు తెలిపారు. సబ్బండ వర్గాల అభ్యున్నతి, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ప్రజలను కోరారు.

## బీఆర్ఎస్ గెలిస్తేనే అభివృద్ధి



వినాయకనగర్‌లో ప్రచారం చేస్తున్న మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

నేరేడ్‌మెట్, అక్టోబర్ 21: బీఆర్ఎస్ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమని, అభివృద్ధి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. వినాయకనగర్ డివిజన్‌లో శనివారం స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్ధం పరశురాంరెడ్డి, తులసి సురేశ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మీ బిడ్డగా మీ మధ్యే ఉంటా

**కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత**

కంటోన్మెంట్, అక్టోబర్ 21: మీ బిడ్డగా మీ మధ్యే ఉంటానని.. కారు గుర్తుకు ఓటేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత ప్రజలను కోరారు. కంటోన్మెంట్ రెండో వార్డులోని అన్నానగర్, సీబీఎన్ నగర్, ఇందిరమ్మనగర్, అర్జున్‌నగర్‌లలో శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా లాస్యనందిత మాట్లాడుతూ... ఐదేండ్లలో వందల కోట్ల నిధులను తెచ్చి దివంగత ఎమ్మెల్యే సాయన్న నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ప్రతిపక్ష పార్టీలకు అధికార దాహం తప్ప అభివృద్ధిపై ఎలాంటి ఎజెండా లేదన్నారు. వారికి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, కుమార్ ముదిరాజ్, నరేశ్, ధన్ రాజ్, ఆంజనేయులు, నర్సింహ, గౌస్, శ్యాంరెడ్డి, వాహెబ్, చంద్రకాంత్, దేవరాజ్, మహేశ్, ప్రవీణ్, ప్రకాశ్, నాగేశ్, బాలరాజ్, రఫీక్,అజీమ్,నజీర్, యూఫ్ బీ, యాసిన్, రాజు, రవి, కమలమ్మ, కుమార్ గౌడ్, నాగరాజు, జిలానీ, శ్రీను పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత

## దేవాలయాలను అభివృద్ధి చేస్తా

**బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**

మన్సూరాబాద్, అక్టోబర్ 21: దేవాలయాల అభివృద్ధితో పాటు బ్రాహ్మణ సంక్షేమానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి చింతలకుంటలోని ప్రలవిగార్డెన్‌లో నిర్వహించిన బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో అతి పెద్ద సర్వమతహిత ముక్తీఘాట్‌ను నిర్మించి అందులో బ్రాహ్మణులు అపరకర్మలు చేసుకునేందుకు భవనాన్ని నిర్మించామన్నారు. సాహెబ్‌నగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని శ్మశానవాటికల్లోను అపరకర్మల భవనాన్ని నిర్మిస్తానని చెప్పారు. వనస్థలిపురం హుడా బిల్డింగ్‌లో ఉన్న గాయత్రి భవన్‌ను బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్‌కు శాశ్వత ప్రాతిపదికన అందజేస్తామన్నారు. ఐదేండ్లలో ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. నామినేషన్‌కు అయ్యే ఖర్చు నిమిత్తం బ్రాహ్మణులందరూ ఒక్క రూపాయి చొప్పున ఇవ్వాలని కోరగా... వారు స్పందించి ఒక్కో రూపాయిని ఇచ్చి ఆశీర్వదించారు.



బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న బ్రాహ్మణులు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి, జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ కమలాసుధీర్‌రెడ్డిని బ్రాహ్మణులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో తులసి శ్రీనివాస్, టీబీఎస్ఎస్ జంటనగరాల మాజీ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నందిరాజు లక్ష్మీనారాయణ, కార్యదర్శి జగన్మోహనాచారి, వాసుదేవరావు, కేఆర్ ప్రసాద్, చంద్రశేఖర్, శేషాచలపతి, మూర్తి, పీవీ బీడీ శర్మ, స్వర్ణ శ్రీనివాసరావు, ఎంఎస్‌కే ప్రభు, సాదు శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆప్యాయంగా పలకరిస్తూ..కాలేరు ప్రచారం



అన్నపూర్ణ నగర్‌లో అరటి పండ్ల వ్యాపారికి కరపత్రం అందజేస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్

గోల్నాక, అక్టోబర్ 21: అంబర్‌పేట నియోజకర్గంలో ప్రధాన ప్రతిపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లు ఇంకా ఖరారు కాకముందే బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. శనివారం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గోల్నాక డివిజన్ అన్నపూర్ణ నగర్, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులుతో కలిసి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో గత నాలుగున్నరేండ్లలో జరిగిన అభివృద్ధి, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు జైకొడుతూ స్థానిక మహిళలు మంగళహారతులు ఇచ్చి ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం పలికారు. బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోతో పాటు నియోజకవర్గ అభివృద్ధిని వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఓటర్లకు అందజేస్తూ మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ ప్రచారంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉప్పల్ లో బండారి గెలుపు ఖాయం

- ఎన్నికల ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి
- ప్రతి పక్షపార్టీల ఎత్తుగడలను తిప్పి కొట్టాలి



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి

రామంతాపూర్, అక్టోబర్ 21: ఉప్పల్ నియోజక వర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని బండారి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని రావుల శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం రామంతాపూర్ పద్మశాలి భవన్‌లో డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు.ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో గతంలో కన్నా భారీ మెజార్టీతో బీఆర్ఎస్ పార్టీ గెలువబోతోందని స్పష్టం చేశారు. అనంతరం అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... ఉప్పల్ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తానని, ప్రజలు ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ జ్యోత్స్ననాగేశ్వర్‌రావు, శ్రీకాంత్‌గౌడ్, నర్సింహ, మధుసూదన్ రెడ్డి, మల్లయ్య, ముస్తాక్, సంపత్‌కుమార్, సంపత్‌రావు, శాగ రవీందర్, శంకర్, సూరం శంకర్, మహిళా నేతలు సంధ్యారాణి, మంజుల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికే జై కొట్టండి : మాగంటి



మ్యానిఫెస్టో అంశాలను ముద్రించిన పత్రాలను మైనార్టీలకు అందజేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, అక్టోబర్ 21: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీనే ఆశీర్వదించాలని జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన బోరబండలోని బస్తీల్లో పాదయాత్ర చేశారు. ప్రచారంలో మైనార్టీలు సహా వందలాది మంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానికులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కీలక అభివృద్ధి పనులతో పాటు భారీ ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పలు సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకుంటున్న బీఆర్ఎస్ సర్కారు హ్యాట్రిక్ సాధించాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని.. ఈ మహా ఘట్టం త్వరలో ఆవిష్కృతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, కోఆర్డినేటర్ విజయసింహ, విజయకుమార్ పాల్గొన్నారు.